క్లుప్తంగా

స్మార్ట్ విద్యుత్ మీటర్ ఏర్పాటు



అంగన్‌వాడీ కేంద్రంలో అమర్చిన స్మార్ట్ విద్యుత్ మీటర్‌తో అధికారులు

ఆరిలోవ: ఏపీఈపీడీసీఎల్ జోన్–3 అధికారులు మంగళవారం మొట్ట మొదటి స్మార్ట్ విద్యుత్ మీటర్ ఏర్పాటు చేశారు. దీన్ని జీవీఎంసీ తొమ్మిదో వార్డు పరిధి విశాలాక్షినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేశారు. విద్యుత్ సర్వీస్ నంబర్ వి 027/345530తో దీన్ని అమర్చినట్టు జోన్–3 ఈఈ పోలాకి శ్రీనివసరావు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలలో అమర్చి వాటి పనితీరు పరిశీలించిన అనంతరం వాటిని ఇతర విభాగాలలో వాడుకలోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో జోన్–3 విద్యుత్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

మోడల్ గ్రీన్ స్పేస్‌గా ఏయూ



మొక్కలు నాటే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏయూ వీసీ ఆచార్య శశిభూషణరావు

విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్సిటీని మోడల్ గ్రీన్ స్పేస్‌గా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు తెలిపారు. మంగళవారం ఏయూ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆదేశాల మేరకు ఏయూలో 'ప్లాంట్ ఫర్ మదర్' పేరుతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టులో విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్‌లు, సిబ్బంది నుంచి చురుకైన భాగస్వామ్యం ఉంటుందన్నారు.

బాక్సింగ్ లీగ్ విజేతలకు సన్మానం



క్రీడాకారులతో రఘురామ్, గొర్లె చందు తదితరులు

కంచరపాలెం : ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన నేషనల్ బాక్సింగ్ లీగ్ (జీజీకే)లో ప్రతిభ చూపిన విశాఖకు చెందిన ఆంధ్ర ప్రొఫెషనల్ బాక్సింగ్ కౌన్సిల్‌కు చెందిన కలిశెట్టి శ్రీను, సురేష్‌ను మంగళవారం సత్కరించారు. శ్రీను 1 నిమిషం 40 సెకెన్లలో ప్రత్యర్థిని నాకౌట్ చేశాడు. మరో బాక్సర్ సురేష్ విజయం సాధించాడు. ఇరువురు సెప్టెంబర్ 13, 14న కొచ్చిన్‌లో ఇండియన్ బాక్సింగ్ కౌన్సిల్ నిర్వహించే ప్రొఫెషనల్ బాక్సింగ్ లీగ్ పోటీలకు వెళ్లనున్నారు. ఈ మేరకు జీవీఎంసీ 46వ వార్డు కైలాసపురంలో మంగళవారం ఆంధ్ర ప్రొఫెషనల్ బాక్సింగ్ కౌన్సిల్ అధ్యక్షుడు యల్లపు రఘురామ్, నేషనల్ పోర్టు ట్రస్ట్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు గొర్లె చందు విజేతలను ఘనంగా సత్కరించారు. అనంతరం వీరు మాట్లాడుతూ భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి అమ్మోరు.నాయుడు, డాక్టర్ సునీల్, రుబెన్, వాసు, గోపాల్, సతీష్, క్రీడాకారులు కె.శ్రీను, సురేష్, జగదీష్, స్వామి, రవి, తరుణ్, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

కళ్లకలకలపై అవగాహన ఉండాలి

ఆరిలోవ: కళ్ల కలకలపై ప్రతి ఒక్కరు అవగాహన ఉండాలని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల వైద్యురాలు ఎ.హిమబిందు తెలిపారు. హనుమంతవాక వద్ద ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో మంగళవారం కళ్ల కలకలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైరస్‌లు, బ్యాక్టీరియా, అలర్జీలు కారణంగా కళ్ల కలకలు వస్తాయన్నారు. వీటిని పింక్ ఐ అని పిలుస్తారన్నారు. దీని వల్ల కళ్లు రెప్పలు వాపు, నొప్పి వస్తాయన్నారు. ఇది అంటువ్యాధి అని, ఈ వ్యాధి సోకినవారు ఇతరులకు దూరంగా ఉండాలన్నారు.

'ఓపెన్ జిమ్‌లు' క్లోజ్



నిరుపయోగంగా ఓపెన్‌జిమ్‌లో పరికరం



బీచ్‌రోడ్డులోని ఓపెన్ జిమ్‌లో తప్పు పట్టిన పరికరాలు

- తుప్పు పట్టిన పరికరాలు
- గాలికొదిలేసిన జీవీఎంసీ
- సందర్శకుల నిరాశ
- కొత్తవి ఏర్పాటు చేయాలని డిమాండ్

బీచ్‌రోడ్డు: ఆరోగ్యంగా ఉండాలంటే నిరంతరం వ్యాయమం తప్పని సరి అని నిపుణులు చెబుతున్నారు. వ్యాయామం చేసే నగర వాసులకు సాగరతీరం ఒక వరం అని చెప్పాలి. ఉదయం.. సాయంత్రం అలా తీరం వెంబడి వాకింగ్ చేస్తూ మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యాన్ని పెంచుకునే అవకాశం ఉంటుంది.

నగరవాసులకు ఆరోగ్యాన్ని అందించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఓపెన్ జిమ్‌లను సాగరతీరంలో ఏర్పాటు చేశారు. నగరవాసులు వాకింగ్ చేసుకొని అనంతరం వ్యాయామ పరికరాలతో ఫిట్‌నెస్ పెంపొందించుకునేవాళ్లు. అలాంటి జిమ్‌లో పరికరాలు తుప్పు పట్టాయి. జీవీఎంసీ అధికారుల నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారాయి.

తుప్పుపట్టిపోతున్న వ్యాయామ పరికరాలు

సాగరతీరంలో రూ.20 లక్షలతో ఓపెన్ జిమ్‌లను యోగా విలేజ్, వైఎస్సార్ విగ్రహం వద్ద స్థలంలో ఏర్పాటు చేశారు. అయితే వాటి నిర్వహణ. పర్యవేక్షణ లేకపోవడంతో 70 శాతానికిపైగా పరికరాలు పూర్తిగా తుప్పుపట్టాయి. దీంతో వ్యాయమం చేయాలనుకున్న వారు కేవలం వాకింగ్‌కే పరిమితమవుతున్నారు.

నూతన పరికరాలను ఏర్పాటు చేయాలి

తీరం వెంబడి ఉన్న నిర్మాణాలు..పరికరాలు సముద్ర గాలులు కారణంగా వేగంగా పాడవుతాయి. అలాంటిది ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేసి మూడేళ్లకుపైగా అవుతున్న వాటి నిర్వహణ..పర్యవేక్షణ లేకపోవటంతో పూర్తి స్థాయిలో పరికరాలు తుప్పుపట్టాయి. వాటి స్థానంలో నూతన పరికరాలను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



అధ్వానంగా వ్యాయామ పరికరం

అధికారులు స్పందించాలి



గతంలో సాగరతీరంలో వాకింగ్ వచ్చి వ్యాయామం చేసుకునేందుకు ఓపెన్ జిమ్‌లోని పరికరాలు వినియోగించుకునేవాళ్లం. ఆ పరికరాలు ఇప్పుడు పూర్తిగా తుప్పుపట్టిపోవటంతో కేవలం వాకింగ్ చేసుకొని వెళ్లిపోతున్నాం. జీవీఎంసీ అధికారులు తక్షణమే నూతన పరికరాలు ఏర్పాటు చేయాలి.

–వంశీ చింతలపాటి, యూత్ చైర్మన్, వాకర్స్ ఇంటర్నేషనల్

పచ్చదనం పెంపొందించాలి



వీఎంఆర్‌డీఏ పార్కులో పర్యటిస్తున్న మెట్రోపాలిటన్ కమిషనర్ విశ్వనాథన్

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ పార్కు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, గ్యాప్స్ ఉన్న చోట పచ్చదనం పెంపొందించాలని మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం వీఎంఆర్‌డీఏ(వుడా) పార్కును సందర్శించారు. ఫేజ్–2లో ఉన్న స్కేటింగ్ రింక్ చుట్టూ తుప్పు పట్టిన హ్యాండ్ రైలింగ్స్‌ను తక్షణమే మార్చాలని చెప్పారు. బీచ్ వైపు ఉన్న కాంపౌండ్ వాల్‌పై తుప్పు పట్టిన గ్రిల్స్ స్థానంలో ఇటుక గోడ నిర్మించాలన్నారు. ఫేజ్–1లో పిల్లల ఆటల ప్రాంగణంలో ఉన్న పాడైపోయిన ఈపీడీఎం రబ్బర్ ఫ్లోరింగ్ టైల్స్‌ను సాధ్యమైనంత త్వరగా మార్చాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో సీఈ భవానీ శంకర్, ఎస్ఈ బలరామరాజు, ఈఈలు ఎస్‌వీఎస్.ఎన్.రాజు, రామరాజు, రేంజ్ ఆఫీసర్లు శ్యామల, శివాని, డీఈఈ సుధీర్, మురళీకృష్ణ, ఏఈలు హసీనా బేగం, సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న ఆకతాయిలు



పెదగదిలి ప్రాథమిక పాఠశాలలో తొలగించిన ట్యాప్‌లు



సగానికి విరగగొట్టిన బాత్‌రూమ్ తలుపు

ఆరిలోవ: పాఠశాలల్లో ఆకతాయిల అల్లరిచేష్టలు పెరిగిపోతున్నాయి. రోజూ ఏదో ఒక పాఠశాలలో వీళ్ల హడావుడి కనిపిస్తోంది. తెల్లవారి పాఠశాల తలుపులు తెరిచేసరికి ఏదో ఒకటి మాయమవడమో, పాడవడమో జరుగుతోంది. దీంతో పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. మద్యం మత్తులో ఆకతాయిలు పాఠశాలలో వస్తువులు పాడుచేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. పెదగదిలిలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం రాత్రి ఆకతాయిలు కొన్ని వస్తువులు ధ్వంసం చేశారు. మంగళవారం ఉదయం పాఠశాల తెరిచిన ఉపాధ్యాయులు దీనిపై ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి కొందరు ఆకతాయిలు పాఠశాల గేటు దూకి లోపలకు ప్రవేశించారు. మద్యం సేవించి ఖాళీ బాటిళ్లను ఆవరణలో పడేశారు. ఇక్కడ విద్యార్థులు కోసం ఏర్పాటు చేసిన నీటి ట్యాప్‌లను విరిగగొట్టారు. అంతటితో ఆగకుండా బాత్‌రూమ్ తలుపులు సగానికి ధ్వంసం చేశారు. పోలీసులు నిఘా పెట్టాలని కోరారు. ఇదిలా ఉండగా ఆరిలోవ ప్రాంతంలో రోజూ పాఠశాలు, అంగన్వాడీ కేంద్రాలలో మందుబాబులు హడావుడి చేస్తున్నారు. రెండు రోజుల క్రితం నెహ్రూనగర్ అంగన్వాడీ కేంద్రంలో మందుబాబులు హల్‌చల్ చేసిన విషయం తెలిసిందే. తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రతి రోజూ ఈ పరిస్థితి నిత్యకృత్యంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మృగాళ్లను కఠినంగా శిక్షించాలి



ర్యాలీ చేస్తున్న సభ్యులు



నిరసన తెలుపుతున్న మహిళలు

బీచ్‌రోడ్డు: కోల్‌కతాలో మెడికోపై జరిగిన లైంగిక దాడి, దారుణ హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని ఈవెంట్ మేనేజర్స్ అసోసియేషన్ (ఈమా) విశాఖ చాప్టర్ డిమాండ్ చేసింది. దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోతోందని, ఇంట్లో నుంచి బయటికు వెళ్లే గృహిణులు, యువతులు, ఆఖరికి బాలికలతో సహా ఎవ్వరికీ రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం బీచ్‌రోడ్ లోని కాళీమాత గుడి వద్ద నుంచి వైఎంసీఏ వరకు నగరంలో గల ఈవెంట్ మేనేజర్లు, కళాకారులు, యాంకర్లు, సింగర్లు, ఈవెంట్ రంగానికి చెందిన పలు విభాగాల ప్రతినిధులు, రోటరీ క్లబ్ సభ్యులు భారీ స్థాయిలో కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. ఈమా చేపట్టిన ఈ నిరసన కార్యక్రమానికి పలు వర్గాల నుంచి మద్దతు లభించింది. ఈమా విశాఖ అధ్యక్ష కార్యదర్శులు సందీప్ కుమార్, షరీఫ్ ఖాన్, ఇతర కార్యవర్గ సభ్యుల నేతత్వంలో జరిగిన ఈ కొవ్వొత్తుల నిరసన ర్యాలీ కార్యక్రమంలో పలువురు ప్రముఖ ఈవెంట్ మేనేజర్లు, కళాకారులు, రోటరీ క్లబ్ ప్రతినిధులు, వైజాగ్ సౌండ్స్ అండ్ లైటింగ్స్, క్యాటరింగ్, సప్లియర్స్, వైజాగ్ డ్యాన్సర్స్ అసోసియేషన్ తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌రోడ్డు: మెడికో హత్యను ఖండిస్తూ 28వ వార్డు ప్రజాతంత్ర మహిళా సంఘం నాయకురాలు మణి ఆధ్వర్యంలో మంగళవారం పందిమెట్ట జంక్షన్‌వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మణి మాట్లాడుతూ పదేళ్లుగా మహిళలపై ఇలాంటి దాడులు జరుగుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. మహిళలకు రక్షణ కల్పించాలని, నిందితులను శిక్షించేందుకు వెంటనే ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సరస్వతి, సత్యవతి, ఓ.సరస్వతి, మంగ తదితరులు పాల్గొన్నారు.

'గాలికుంటు' టీకా.. పశువులకు రక్ష

- మొదటి విడత ప్రారంభం
- జిల్లా వ్యాప్తంగా 54,400 పశువులకు వ్యాక్సినేషన్



పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్ రామకృష్ణ



పాడి పశువులకు గాలి కుంటు వ్యాధి టీకాలు వేస్తున్న పశు వైద్యులు..

ఆరిలోవ: పాడి పశువులకు వ్యాధులకు గురికాకుండా పశు సంవర్ధక శాఖ చర్యలు చేపడుతోంది. నిత్యం పశువుల రోగ్యం కోసం వైద్యసేవలు అందిస్తోంది. పశువులకు అతి ప్రమాదకరంగా మారే గాలికుంటు వ్యాధి రాకుండా కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఈనెల 20 నుంచి సెప్టెంబర్ 18 వరకు మొదటి విడత టీకాలు వేసే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. రెండో విడత టీకాలు వేసే కార్యక్రమం వచ్చే ఏడాది మార్చి 1 నుంచి నిర్వహించనున్నారు. జిల్లాలో నాలుగు నెలల దాటిన పశువులు 54,400 వరకు ఉన్నాయి. వాటిలో దూడలు, ఆవులు, గేదెలు, ఎద్దులు, దున్నలు ఉన్నాయి. పశు సంవర్ధక శాఖ అధికారులు వాటికి 54,400 డోసులు టీకాలు వేయనున్నారు. ఆనందపురం, పద్మనాభం, భీమునిపట్నం, పెందుర్తి మండలాల్లో సుమారు 70 శాతం పశువులు ఉన్నాయి. మధురవాడ, ఎండాడ, రుషికొండ, ఆరిలోవ, సింహాచలం, అడవివరం, ఇసుకతోట, గాజువాక, గాపాలపట్నం ప్రాంతాలలో 30 శాతం వరకు పశువులు ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు.

రైతులు తప్పనిసరిగా టీకాలు వేయించాలి

జిల్లాల్లో పశువులకు రైతులు తప్పనిసరిగా గాలి కుంటు వ్యాధి రాకుండా ముందు జాగ్రతగా టీకాలు వేయించాలని పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ రామకృష్ణ సూచించారు. ఈనెల 20 నుంచి సెప్టెంబరు 18 వరకు తొల విడత టీకాలు వేసే కార్యక్రమం ప్రారంభమైందన్నారు. 54,400 పశువులకు టీకాలు వేసేందుకు డోసులు సిద్ధం చేశామన్నారు. ఆ టీకాలను జిల్లా వ్యాప్తంగా పశు వైద్య శాలలకు పంపిణీ చేశామని తెలిపారు. టీకాలు వేసేందుకు జిల్లాలో వ్యాప్తంగా 83 మంది సిబ్బంది పని చేస్తున్నారు. వారు గ్రామాల్లో ఇళ్లకు వెళ్లి పశువులకు టీకాలు వేసిన అనంతరం ఆ పశువుకు ఫొటో తీసి భారత్ పశు ధన్ యాప్‌లో అప్‌లోడు చేస్తున్నారని తెలిపారు. దీంతో దేశంలో ఏ రోజు ఎన్ని పశువులకు టీకాలు వేశారో నమోదవుతుందన్నారు.

కలెక్టరేట్ ఎదుట వైద్య విద్యార్థుల నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వైద్య విద్యార్థులు

మహారాణిపేట: కోల్‌కతాలో వైద్యురాలి హత్యాచార ఘటనకు నిరసనగా జూనియర్ వైద్యులు, వైద్య విద్యార్థులు మంగళవారం నగరంలో ప్రదర్శన నిర్వహించారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ వద్ద మొదలైన నిరసన ప్రదర్శన కేజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం మీదుగా కలెక్టర్ కార్యాలయం వరకు సాగింది. అక్కడ వైద్య విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్సీ చిరంజీవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, పలువురు న్యాయవాదులు కలెక్టరేట్‌కు చేరుకుని వైద్య విద్యార్థులకు సంఘీభావం ప్రకటించారు. అధ్యక్షుడు డాక్టర్ టి.పృథ్వీరాజ్, ఉపాధ్యక్షులు ఆర్.ఊహ, కార్యదర్శి రాజా వివేక్, డాక్టర్ సంయుక్త పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు..

కొద్ది రోజుల నుంచి సమ్మె చేస్తున్న వైద్య విద్యార్థులు కేజీహెచ్‌లో ఓపీ, వార్డులకు హాజరు కాకపోవడంతో సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. ఓపీ, వార్డుల్లో అత్యవసర సేవలు నిలిచిపోకుండా ఏర్పాట్లు చేశారు. రోగులకు వైద్య సేవలకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టామని, ఓపీ కోసం పలువురి సేవలను ఉపయోగించుకుంటున్నట్లు తెలిపారు.

దాబాగార్డెన్స్: కోల్‌కతాలో యువ ట్రైనీ డాక్టర్‌పై జరిగిన లైంగిక దాడి, హత్యను ఖండిస్తూ ఎల్ఐసీ ఉద్యోగులు మంగళవారం సాయంత్రం కొవొత్తులు వెలిగించి ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. మహిళలపై హింసను వ్యతిరేకిస్తూ శాంతియుతంగా ప్రదర్శన నిర్వహించి సత్వర న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఆహార నాణ్యత కచ్చితంగా పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీడీ రామారావు

ఎంవీపీకాలనీ: విద్యార్థుల సంక్షేమంతో పాటు హాస్టళ్లలో ఆహార నాణ్యత కచ్చితంగా పాటించాలని సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు జిల్లాలోని వివిధ హాస్టళ్ల వార్డెన్లకు సూచించారు. ఈ మేరకు మంగళవారం డీఆర్‌డీఏలోని కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. హాస్టళ్ల నిర్వహణపై వార్డెన్‌లతో, స్కాలర్‌షిప్స్ చెల్లింపులపై ఫీల్డ్ ఆఫీసర్లతో వేరు వేరుగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టళ్లలో బయట ఆహారాన్ని అనుమతించవద్దన్నారు. నాణ్యతమైన ఆహారం విద్యార్థులకు అందించడంతో పాటు విద్యా ప్రమాణాలు పెంచడంతో పారిశుధ్యం, పరిశుభ్రతపై ప్రత్యేక చర్యలు తీసుకోవడం చేయాలని వార్డెన్లను ఆదేశించారు. పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల చెల్లింపు కోసం ఎస్సీ, బీసీ, గిరిజన వెల్ఫేర్ హాస్టల్స్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కళాశాలల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని సూచించారు. హాస్టళ్ల నిర్వహణ, సౌకర్యాలపై నిర్వహించనున్న రాష్ట్రస్థాయి వర్కుషాపు కోసం అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. పలువురు అధికారులు, వార్డెన్లు పాల్గొన్నారు.

22 కిలోల గంజాయి పట్టివేత

సీతమ్మధార : అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని ఫోర్తుటౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ప్రకాశం జిల్లా గిద్దలూరు ప్రాంతానికి చెందిన నిబ్బరగండ్ల రంజిత్‌కుమార్ రెడ్డి (29), కె.ఆండ్రోస్ (25) కలిసి ఈ నెల 17న అరకు వెళ్లారు. అక్కడ రెండు రోజులు గడిపిన తర్వాత మధ్యవర్తి ద్వారా 22 కిలోల గంజాయి రూ.60 వేలతో కొనుగోలు చేసి విశాఖ రైల్వే స్టేషన్‌కు బయలుదేరారు. ఈ విషయంపై ఫోర్తుటౌన్ సీఐ ఎస్.విజయకుమార్‌కు ముందుగానే సమాచారం అందడంతో సిబ్బందితో రైల్వే స్టేషన్‌కు చేరుకుని పరిశీలించారు. అక్కడ రంజిత్‌కుమార్ రెడ్డి, ఆండ్రోస్ అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారించారు. బ్యాగులో గంజాయి ఉన్నట్లు గుర్తించి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

లలితానగర్‌లో చోరీ



చిందరవందరగా బీరువాలోని సామగ్రి

సీతమ్మధార : ఫోర్తుటౌన్ క్రైం పోలీస్ స్టేషన్ పరిధి అక్కయ్యపాలెం, లలితానగర్‌లో విశ్రాంత ఉద్యోగి ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విశ్రాంత ఉద్యోగి ఎస్.హరిహరరావు కుటుంబ సభ్యులతో పది రోజుల క్రితం ఊరు వెళ్లారు. మంగళవారం ఉదయం ఇంటికి వచ్చి చూసే సరికి కిటికీ అద్దాలు బద్దలుకొట్టి గ్రిల్ తొలగించి ఉంది. దీంతో తలుపులు తీసి లోపలకు వెళ్లి చూసే సరికి బీరువా తెరిచి దుస్తులు చిందరవందరగా మంచంపై వున్నాయి. బీరువాలో పరిశీలించగా తులం బంగారు నగ, అర కిలో వెండి వస్తువులు కనిపించకపోవడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈస్టు క్రైం ఏసీపీ వెంకటరావు, సీఐ ఆదమ్‌తోపాటు క్లూస్ టీం సిబ్బంది ఇంటికి చేరుకుని పరిశీలించారు. వేలిముద్రలు సేకరించారు. హరిహరరావు ఫిర్యాదు మేరకు టూటౌన్ క్రైం ఇన్‌చార్జి ఎస్ఐ ఎం.సునీల్ కేసు నమోదు చేశారు. ఏసీపీ ఆధ్వర్యంలో లలిత నగర్‌లోని సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నారు. గతంలో సీతమ్మధార బాలయ్యశాస్త్రి లే అవుట్‌లోని ఒక ఇంట్లో ఇదే మాదిరిగా కిటికీ గ్రిల్ తొలిగించి చోరీకి పాల్పడడంతో పోలీసులు పాత నేరస్తులపై నిఘా పెట్టారు.

పర్సెప్షన్ విభాగంలో పుంజుకోవాలి



మాట్లాడుతున్న ఏయూ వీసీ శశిభూషణ్‌రావు

విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్సిటీ పర్సెప్షన్ విభాగంలో వెనుకబడిందని, ఈ పరిస్థితి నుంచి పుంజుకునే దిశగా కృషి చేయాలని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణ్‌రావు సూచించారు. ఈ నెలాఖరుకు ఐఎస్ఓ సర్టిఫికేషన్‌కు సంబంధించిన పర్యవేక్షణ బృందం ఏయూను సందర్శించనుంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఏయూ అకడమిక్ సెనేట్ మందిరంలో ఐఎస్ఓ మేనేజ్‌మెంట్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రీ సర్టిఫికేషన్‌కు అవసరమైన ప్రక్రియ, తదితర అంశాలపై విభాగాధిపతులు, బీఓఎస్ చైర్మన్లు, విభాగ ఆచార్యులతో ప్రత్యేకంగా సమావేశమై వారికి దిశానిర్దేశం చేశారు. తరగతులు సక్రమంగా నిర్వహించాలని, ఫ్యాకల్టీ పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలని సూచించారు. ఇటీవల విడుదల చేసిన ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో మెరుగైన ర్యాంకులను సాధించడం జరిగిందని వివరించారు. ఈ సమావేశంలో ఐక్యూఏసీ సమన్వయకర్త ఆచార్య జి.గిరిజాశంకర్, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి



వృద్ధురాలి మృతదేహం

మల్రిపాలెం : ఓ గుర్తు తెలియని వృద్ధురాలు మృతిచెందిన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. కంచరపాలెం ఆర్‌పీ పేట బ్రిడ్జి కిందన పైడితల్లమ్మ ఆలయం సమీపంలో ఓ గుర్తు తెలియని వృద్ధురాలు మృతిచెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించి సచివాలయ సిబ్బందికి సమాచారం అందించారు. స్థానిక వీఆర్‌వో షహనాజ్ పోలీసులకు సమాచారం అందించి ఫిర్యాదు చేశారు.

అన్నానగర్‌లో నల్ల మరియమ్మ ఉత్సవాలు



అమ్మవారిని పూజిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డు పరిధి అన్నానగర్‌లో నల్ల మరియమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని గ్రామ సంఘం పెద్దలు పచ్చని కొమ్మలు, పూల మాలలతో అలంకరిచారు. అన్నానగర్, బాలాజీగర తోట గరువు, గాంధీనగర్ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. గ్రామంలో మహిళలు 108 కలశాలతో జలాభిషేకం, పంచామృతాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్ అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. మేయర్‌తో పాటు గ్రామ సంఘం పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారికి పూజలు చేశారు.